క్లుప్తంగా

సుఖసంతోషాలతో వర్ధిల్లాలి...

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఉమా సదాశివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: సంక్రాంతి పండగ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆకాంక్షించారు. భోగి పర్వదినం సందర్భంగా రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన క్షేత్ర పాలకులైన ఉమా సదాశివస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మల్లికార్జునశర్మ, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న 'సాధన' సభ్యులు



రక్తదానం చేస్తున్న లక్ష్మీనారాయణ, శ్రీను

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన సాధనా యువజన సంఘ సభ్యులు మరోసారి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఇదే ప్రాంతానికి చెందిన డయాలసిస్ రోగి కనకల రాజారావుకు శనివారం అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరమైంది. రోగి బంధువులు సాధనా యువజన సంఘ ప్రతినిధులను సంప్రదించగా, సభ్యులు కాళ్ల లక్ష్మీనారాయణ, శ్రీను రక్తదానానికి ముందుకొచ్చారు. ఇరువురూ విజయనగరంలోని ఎస్‌వీఎన్ బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తం అందించారు. ఇదిలా ఉంటే లక్ష్మీనారాయణ ఇప్పటికే 11 సార్లు, శ్రీను 17 సార్లు రక్తదానం చేయడం విశేషం.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు రూపొందించిన 2023 సంవత్సరం క్యాలెండర్‌ను జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు శనివారం విజయనగరంలో ఆవిష్కరించారు. క్యాలెండర్లను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడితో పాటు నగర పంచాయతీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులకు వాసు అందజేశారు.

ఆస్తుల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న సీబీపీఎస్‌సీ కార్యదర్శి, సంఘమిత్ర ఆర్‌ఎస్.జాన్

విజయనగరం టౌన్: అన్యాక్రాంతమవుతున్న సీబీసీఎన్‌సీ చర్చి ఆస్తులను పరిరక్షించడమే ధ్యేయంగా తామంతా కలిసి పనిచేస్తున్నామని సీబీసీఎన్‌సీ ప్రతినిధులు తెలిపారు. శనివారం స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చిలో ఉత్తర సర్కారుల బాప్టిస్ట్ చర్చిల మహాసభలు చర్చి అధ్యక్షుడు ఆనందరావు ప్రార్థనలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘమిత్ర ఆర్‌ఎస్.జాన్ మాట్లాడుతూ, సీబీసీఎన్‌సీ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, ఈ విషయంలో సీఎం స్పందించి సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

సహాయం చేయడంలోనే సంతృప్తి



నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఈశ్వరరావు, తదితరులు

విజయనగరం టౌన్: నిరుపేదలకు సహాయమందించడంలోనే సంతృప్తి ఉంటుందని సుధారాణి మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు అన్నారు. స్థానిక గుంటూరు వారి వీధిలో ఉన్న బృందావనం అపార్ట్‌మెంట్స్ ఆవరణలో 50 మందికి శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఉపేంద్రకుమార్, కోశాధికారి శిరీష, అపార్ట్‌మెంట్ కార్యదర్శి బాషా, రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● భోగభాగ్యాల భోగి...



వసంత విహార్‌లో భోగిమంట చుట్టూ తిరుగుతున్న స్థానికులు

నాలుగు రోజుల సంక్రాంతి పండగ భోగీతో ఘనంగా మొదలైంది. సూర్యభగవానుడు ధనస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించడాన్నే మకర సంక్రాంతి అంటారు. ఈ పండగకు ఒక్కరోజు ముందు భోగి పండగ చేసుకుంటారు. భోగి మంటల్లో పాత వస్తువులతో పాటు పశువుల పేడతో తయారు చేసిన పిడకలు వేయడం వల్ల గాలి శుద్ధి కావడంతో శ్వాస సంబంధిత వ్యాధులు రావనేది పెద్దల నమ్మకం. రంగనాథస్వామిలో గోదాదేవి ఐక్యమైన రోజు.. వామన అవతారంలో మహా విష్ణువు బలిచక్రవర్తిని పాతాళ లోకానికి పంపించిన రోజు.. శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని ఎత్తిన రోజు.. రైతుల కోసం ఈశ్వరుడు భూమి మీదకు నందిని పంపిన రోజు కూడా కావడంతో అన్నివర్గాల ప్రజలు భోగిని ఘనంగా జరుపుకున్నారు. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా వాడవాడలా శనివారం వేకువజామున భోగి మంటలు వేశారు.
– విజనగరం/నెల్లిమర్ల నెట్‌వర్క్



డెంకాడ: పినతాడివాడలో భోగిమంటకు నమస్కరిస్తున్న పిల్లలు,పెద్దలు



జొన్నగుడ్డిలో భోగి మంటలో వేడినీళ్లు కాస్తున్న స్థానికులు



విజయనగరం ఫోర్ట్: భోగి మంట వద్ద డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ భావన, విక్రమ్ కుటుంబ సభ్యులు



జిల్లా కేంద్రంలో భోగిమంట వద్ద పూజ చేస్తున్న మహిళ



విజయనగరం టౌన్: కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద భోగి మంటలు వేస్తున్న ఆలయ చైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి, తదితరులు

సంప్రదాయాలను కొనసాగించడం అభినందనీయం

● ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు



మొయిదలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న ఆచార, సంప్రదాయాలను నేటికీ కొనసాగించడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఆయన స్వగ్రామమైన మొయిద విజయరామపురంలో శనివారం జరిగిన భోగి వేడుకల్లో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. నెల రోజుల పాటు గ్రామంలో నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమం చివరి రోజు సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెల రోజులుగా వేకువజామున మేలుకొలుపు నిర్వహించి భావితరాలకు సంప్రదాయాలను తెలియజేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, అట్టాడ కనకారావు, శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించాలి



చిన్నారులకు గాలిపటాలు పంపిణీ చేస్తున్న నగర మేయర్

● మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం:

మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మేయర్ విజయలక్ష్మి అన్నారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని షాదీఖానా వద్ద పిల్లలకు గాలిపటాల పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంపడాపు శ్రీనివాసరావు సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, సంక్రాంతి తెలుగువారికి పెద్ద పండగన్నారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కనులపండువగా గోదాదేవి కల్యాణం



విజయనగరం: గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం: నగరంలోని జమ్ము సీతారాముల ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని శనివారం కనులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, శ్రీనివాసరావు దంపతులు కల్యాణం చేపట్టారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దన్నానపేటలో..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేటలో గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. రామమందిరం వద్ద జరిగిన కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నెల్లిమర్ల రూరల్: దన్నానపేటలో కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చక స్వాములు

వితరణ

విజయనగరం: నగర పాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు రెండు జతుల చెప్పులు, నూనె, సబ్బులను మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అందజేశారు. నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 630 మంది కార్మికులకు వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారికి అన్ని రకాల సదుపాయాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల సేవలు మరువరానివన్నారు. కరోనా సమయంలో వారు అందించిన సేవలు అందరూ గుర్తించి గౌరవించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ప్రజారోగ్య విభాగం సిబ్బంది గాంధీ, బాలకృష్ణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడిన మార్కెట్



కొనుగోలు దారులో రద్దీగా మారిన విజయనగరంలోని ప్రధాన మార్కెట్ ప్రాంతం

విజయనగరం: సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని మార్కెట్ శనివారం కూడా కళకళలాడింది. భోగి పండగ రోజు కూడా ప్రధాన మార్కెట్‌లన్నీ కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారంతా ఉదయాన్నే పట్టణానికి చేరుకుని పాదరక్షలు, నిత్యావసరాలు కొనుగోలు చేశారు. దీంతో మెయిన్ రోడ్, గంటస్తంభం జంక్షన్, కన్యకా పరమేశ్వరి ఆలయం జంక్షన్, ఉల్లివీధి, రైల్వే స్టేషన్‌రోడ్, తదితర ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడాయి.

నగరాన్ని కమ్మేసిన మంచు



బాలాజీ జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో పొగమంచు



ఆర్టీసీ కాంప్లెక్స్ అవుట్ గేట్ రోడ్డులో..



కాంప్లెక్స్ రోడ్డులో పొగమంచు

విజయనగరం జిల్లా కేంద్రంలో ఎన్నడూ లేనివిధంగా శనివారం పొగమంచు కురిసింది. వేకువజాము 3 గంటల నుంచి రోడ్డు కనిపించని రీతిలో మంచు కురవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఉదయం 8 గంటల వరకు వాహనదారులు లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

సంక్రాంతి సేవా కార్యక్రమాలు



విజయనగరం: పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



పూసపాటిరేగ: కందివలసలో దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ దేశెట్టి గణేష్, తదితరులు



విజయనగరం: పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



భోగాపురం: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల శ్రీనివాసరావు

విజయనగరం: సంక్రాంతి పండగ సందర్భంగా మదర్ థెరీసా సేవా సంఘం ఆధ్వర్యంలో విజయనగరం పట్టణంలో, అయ్యన్నపేట జంక్షన్‌లో పేదలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. పేద కుటుంబాలన్నీ సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మదర్ థెరీసా సేవా సంఘం ఫౌండర్ త్యాడ ప్రసాద్‌పట్నాయక్, సంఘ సభ్యులు శ్రీనివాస్, శివదీప్, తనీష్, తదితరులు పాల్గొన్నారు.

కందివలసలో..

పూసపాటిరేగ: మండలంలోని కందివలసలో సర్పంచ్ దేశెట్టి గణేష్ సహకారంతో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఏటా సంక్రాంతి పండగ సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తామన్నారు. సుమారు 400 మందికి దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చాపల సత్తిబాబు, వైస్ సర్పంచ్ రౌతు సత్తిబాబు, గ్రామ ప్రజాప్రతినిధి పులపా కామరాజుతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

వెయ్యి మందికి..

భోగాపురం: మండల కేంద్రంలో సుమారు వెయ్యి మంది పేదలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పడాల సత్యవతి చీరలు, లుంగీలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పడాల రాజేశ్వరి, రౌతు వాసు, వరుపుల సంజీబు, అడ్డగర్ల వెంకటరావు, ఊడికల గురువులు, శీల సాధూరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చీరలు ..

విజయనగరం: నగరంలోని తూర్పు బలిజివీధిలో కనకల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కనకల రఘురామారావు చేతుల మీదుగా 200 మంది పేదలకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటరావు, కృష్ణ, సతీష్, గిరి, తదితరులు పాల్గొన్నారు.